# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-09-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. వస్తుసేవల పన్ను జీఎస్టీ సంస్కరణలు స్వయం సమృద్ధ భారత్‌కు దోహదం చేస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

2. విశాఖపట్నంలో జరిగే ఈ గవర్నెన్స్ సదస్సును కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభిస్తారు.

3. ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు తిరిగి ఈరోజు నుంచి కొనసాగనున్నాయి.

4. విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దసరా ఉత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభమయ్యాయి.

5. ఆసియా కప్ 2025లో భాగంగా సూపర్ 4లో జరిగిన టీ20 క్రికెట్ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై భారత్ విజయం సాధించింది.

==========================

వస్తుసేవల పన్ను జీఎస్టీ సంస్కరణలు స్వయం సమృద్ధ భారత్‌కు దోహదం చేస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణలపై ప్రధానమంత్రి నిన్న ప్రసంగిస్తూ, దేశ వ్యాప్తంగా ఈరోజు నుంచి నూతన జీఎస్టీ స్లాబ్ లు అమలులోకి వచ్చాయని అన్నారు.

వాయిస్.. 22 సెకన్లు

మరోవైపు ఈరోజు నూతన జీఎస్టీ ధరలు అమలులోకి రావడంతో దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురంమన్యం జిల్లాకు చెందిన స్థానికుడు ప్రసాద్ ఆకాశవాణితో మాట్లాడుతూ,

వాయిస్ .. 26 సెకన్లు

---

ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీఎస్టీ 2.0కు సంబంధించి తెలుగులో విడుదల చేసిన అన్ని జీవోల సంచికను గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం సంబంధిత అధికారులతో రాష్ట్ర పన్నుల విధానంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి

మాట్లాడుతూ, జీఎస్టీ సంస్కరణలు ప్రజల ఖర్చులను తగ్గిస్తాయని చెప్పారు. ఈ కొత్త జీఎస్టీ విధానం ద్వారా ప్రతి ఇంటికీ, రైతులకు, విద్యార్థులకు, వివిధ రంగాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం –డిఎఆర్‌పిజీ ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖపట్నం వేదికగా ఈరోజు, రేపు రెండు రోజుల పాటు 28వ జాతీయ ఈ గవర్నెన్స్ సదస్సు జరుగనుంది. 'వికసిత్ భారత్: సివిల్ సర్వీస్, డిజిటల్ ట్రాన్స్ ఫార్మేషన్' ఇతివృత్తంతో నిర్వహిస్తున్న ఈ సదస్సును కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో సదస్సుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు విశాఖపట్నం జిల్లా యంత్రాంగం తెలిపింది.

---------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. "సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా పట్టణాలలో రవాణా సౌకర్యాలను కేంద్రప్రభుత్వం ఎలా మెరుగుపరిచిందో ఈ రోజు తెలుసుకుందాం.

వాయిస్ ఓవర్ (1:25)

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు తిరిగి ఈరోజు నుంచి కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉభయ సభలు జరగనున్నాయి. ఈరోజు శాసనసభలో వ్యవసాయంపై లఘు చర్చ జరగనుంది. శాసనమండలిలో వస్తు, సేవల పన్ను– జీఎస్టీ హేతుబద్ధీకరణపై ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వివరణ ఇస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దసరా ఉత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీ కనకదుర్గమ్మవారు ఈరోజు బాల త్రిపుర సుందరి దేవిగా దర్శనమిస్తున్నారు. ఈరోజు నుంచి ప్రారంభమైన ఈ ఉత్సవాలు అక్టోబర్ రెండవ తేదీ వరకు జరగనున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

---------------------------

మరోవైపు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిన్నటి నుంచి బతుకమ్మ సంబరాలు ప్రారంభమైయ్యాయి. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో హనుమకొండ వేయి స్తంభాల ఆలయం వద్ద నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మంత్రులు భట్టి విక్రమార్క, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ 75వ జన్మదినోత్సవ సందర్భంగా ఉత్తమ నాన్ ఫీచర్ చిత్రంగా జాతీయ పురస్కారాన్ని గెలుచుకున్న 'చలో జీతే హై' చిత్రాన్ని ఈనెల 17వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా సినిమా హాళ్లలో ప్రదర్శిస్తున్నారు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీవితంలోని చిన్ననాటి సంఘటనల నుండి ప్రేరణ పొందింది. విశాఖపట్నంలో ఈ చిత్రాన్ని వీక్షించిన ప్రేక్షకులు ఆకాశవాణితో మాట్లాడుతూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

ఆసియా కప్ 2025 లో భాగంగా దుబాయ్ వేదికగా భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య సూపర్ 4 విభాగంలో నిన్న జరిగిన టీ20 క్రికెట్ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై భారత్ విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 18.5 ఓవర్లలో 4 వికెట్లకు 174 పరుగులు చేసి గెలుపొందింది.

--------------------------

ఉత్తర బంగాళాఖాతంలో ఈరోజు అల్పపీడనం ఏర్పడే అవకాశముందని, ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ శుక్రవారం నాటికి వాయుగుండంగా బలపడుతుందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

మరోవైపు తెలంగాణలో ఈరోజు, రేపు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================